## కేసీఆర్‌ను గెలిపిద్దాం



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

కవాడిగూడ, నవంబర్ 23: సెక్యులర్ పార్టీ అయిన బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను గెలిపించాలని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. గురువారం భోలక్‌పూర్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. తాము 119 నియోజక వర్గాలలో పోటీచేయని పక్షంలో కాంగ్రెస్ నేతలు డబ్బులు తీసుకొని పోటీచేయడం లేదని ఆరోపణలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, కానీ ప్రజల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్న బీఆర్ఎస్‌ను బలపరిచేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఆయన అన్నారు.

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు



ముఠా గోపాల్ సమక్షంలో పార్టీలో చేరుతున్న సాయి వరుణ్

చిక్కడపల్లి,నవంబర్23 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున్న చేరుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్ అన్నారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు డాకూరి సాయి వరుణ్ ముఠాగోపాల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## ముఠా గోపాల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న ముఠా జయసింహ,రాకేశ్, లక్ష్మి

చిక్కడపల్లి,నవంబర్23 ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించారని,నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేశారని బీఆర్ఎస్ యువజన విభాగంనాయకుడు ముఠా జయసింహ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్‌కు మద్దతుగా గురువారం నాయకురాలు తుడుం లక్ష్మి రాజేందర్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ లో హరిత అపార్ట్‌మెంట్ వద్ద నుంచి ప్రచారం నిర్వహించారు.

## నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు

కవాడిగూడ, నవంబర్ 23: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన కాంగ్రెస్ అభ్యర్థి అనుచరులపై కేసు నమోదు అయిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సనత్‌నగర్ నియోజక వర్గం సీసీ నగర్ బన్సీలాల్‌పేటలో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ గెలుపు కోరుతూ ప్రచారం చేస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకులు రమేష్, జీఎల్ రమేశ్‌లు స్థానికంగా ఉన్న నల్లపోచమ్మ దేవాలయంతో పాటు కమ్యూనిటీ హాల్‌కు కాంగ్రెస్ అభ్యర్థి నీలిమ ఫొటోలు, ఫ్లెక్సీలను కట్టారు. ఫ్లెక్సీలతో పాటు కాంగ్రెస్ పార్టీ జెండాలు కట్టారు. సమాచారం తెలుసుకున్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను ఉల్లంఘించారని ఎన్నికల అధికారి పార్వతి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ నియోజక వర్గానికి చెందిన ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఇరువురిని పట్టుకొని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.వీరిద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు.



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



ప్రచారంలో భాగంగా వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

# మరోసారి ఆశీర్వదించండి

- అభివృద్ధిని చూసి గెలిపించండి
- ఇంటింటికీ ప్రచారంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 23: శాసన సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ప్రచార వేగాన్ని పెంచింది. ఆ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టకుండా ఎన్నికల ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఐదేళ్లలో తాను వెయ్యి కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, లక్షా పది వేల మంది సంక్షేమ పథకాలు, ఆసరా పింఛన్లు అందించిన తీరును జనంలోకి తీసుకువెళ్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను నేరుగా కలుస్తున్న ముఠా గోపాల్ మీ ఇంటిలో ఎవరికైనా పింఛన్లు వస్తున్నాయా, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీ, మైనారిటీ బంధు, సీఎం రిలీఫ్ ఫండ్, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అందాయా అని ఆరాతీస్తూ పని చేసే పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

### మ్యానిఫెస్టోను వివరిస్తూ...

బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజల్లోకి ముమ్మరంగా తీసుకువెళ్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఓటర్లకు అందచేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలను వివరిస్తున్నారు. రూ.400లకే గ్యాస్, తెల్ల రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, మహిళలకు మూడు వేల ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు, నగరంలో మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వంటి అంశాలను ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

### ప్రచార అస్త్రంగా అభివృద్ధి..

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రచార అస్త్రాలుగా చేసుకొని బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా చేపడుతున్నారు. నియోజకవర్గంలో గురుకుల బీసీ, ఎస్సీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, వీఎస్‌టీ కూడలి విస్తరణ, ప్రతిష్టాత్మకంగా స్టీలు వంతెన నిర్మాణం, ఆర్‌టీసీ క్రాస్ రోడ్డు ఇందిరా పార్కు మార్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం వంటి అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రచార అస్త్రాలుగా వాడుకుంటూ ముందుకు వెళ్తుంది. అంతేకాదు వరద నీటి సమస్యల పరిష్కారం, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, పలు చౌరస్తాలలో సిగ్నల్స్ తొలగించి యూ టర్న్‌లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యకు మోక్షం, అంజయ్యనగర్, సాయిచరణ్ కాలనీ, లంబాడితండా, భోలక్‌పూర్‌లలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం, నాగమయ్యకుంట ప్రధాన నాలాకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం, బీమా మైదానం, దామోదరం సంజీవయ్యనగర్, అడిక్‌మెట్‌లలో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, 45 వేల మందికి ఆసరా పింఛన్ల పంపిణీ, యాభై వేలకు పైగా లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ పండ్, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీని ప్రజల ముందుకు తీసుకు వెళ్తున్నారు.

### సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..


కవాడిగూడ, నవంబర్ 23: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేసి ఓట్లను అభ్యర్థించాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు గురువారం భోలక్‌పూర్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి బూత్ పరిధిలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి కార్తుగా గుర్తుకు ఓటు వేయాలని కోరాలని అన్నారు. 25న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సీఎం బహిరంగ సభకు డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో తరలించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జిలు పరుషరామ్, బల్వీర్ కుమార్, జునేద్ బాగ్దాది, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో..

కవాడిగూడ, నవంబర్ 23: ముషీరాబాద్‌లో చేసిన అభివృద్ధే బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తాయని బీఆర్ఎస్ నగర యువజన విభాగం సీనియర్ నాయకుడు రవీంద్ర కోక అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్‌లో చేసిన అభివృద్ధిని ఓటర్లకు వివరించి చైతన్యం చేస్తున్నామన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా రవీంద్ర కోక మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నాయకులు ఆంజనేయులు, డాక్టర్ జగన్, కొమ్ము రాజేష్, రాము గౌడ్, చంద్రకాంత్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

### ముఠాగోపాల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ముషీరాబాద్, నవంబర్ 23: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్‌ను గెలిపించాలని కోరుతూ ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్‌లలో గురువారం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ఆదేశాల మేరకు డివిజన్‌ల వారిగా బస్తీల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి గులాబీ శ్రేణులు తమ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్ కారు గుర్తుపై ఓటు గెలిపించాల్సిందిగా కోరారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ఇంద్రసేనారెడ్డి, నేత శ్రీనివాస్, మహ్మద్ ఖదీర్, ఎయిర్‌టెల్ రాజు, సోమసుందర్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, బీఎం శ్రీను, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మానగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేత రవీంద్ర కోక



ముషీరాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు